"కిరీటి ఇందాకే ఫోన్ చేశాడు. మరో వారం రోజులకు గాని రాలేడని చెప్పమన్నాడు."

మెర్క్యూరీ దీపపు కాంతిలో ఆమె పెదవులు చిమ్మిన నిర్జీవమైన నవ్వును అతి సులభంగా పసికట్టగలిగాడు.

ఇంత జరిగినా తొణకని నిండు కుండలా నిశ్చలంగా కూర్చున్న ఆమెను చూస్తుంటే జాలిగా వుంది. ఓదార్చాలనిపిస్తోంది.

"సారీ మేడమ్ ... ఐ యామ్ వెరీ సారీ.... శిల్ప సంగతి తెలిసుండీ మీరిలాంటి ప్రయత్నం ఎందుకు చేశారో నాకు అర్థం కావటం లేదు......" బాధగా అన్నాడు.

యోగేంద్రకు అంతా తెలిసిపోయిందన్న నిజం గ్రహించిన కన్య లజ్జితు రాలైనట్టుగా తల వంచుకుంది.

"తల వంచేటంత సిగ్గు మాలిన పని మీరేం చేయలేదు. తనలాంటి స్త్రీ మీద సానుభూతి చూపాలని వెళ్ళారు. ఆమె మనసులో పేరుకు పోయిన మకిలిని తుడిచేయాలని ప్రయత్నించారు. అవమానించబడి వెనక్కి వచ్చారు."

"అబ్బే... పాపం శిల్ప నన్నేమందని? ఏదో చిన్న తనం..." తేలిగ్గా కొట్టేసినట్టుగా అంది.

"అది చిన్నతనం కాదు మేడమ్! బాల్యంనుండి పెంచుకున్న అహంకారం. తనో గొప్పింటి బిడ్డనని కాబట్టి ఆలోచనలు గొప్పవేనని నమ్మే మూర్ఖత్వం. తను జమిందారీ వంశంలో పుట్టింది కాబట్టి తన నిర్ణయాలకు అందరూ కట్టుబడి వుండాలన్న అభిజాత్యం...."

కన్య చాలా సేపటి వరకూ మౌనంగా వుండిపోయింది.

"ఏది ఏమైనా నేను కోరేది ఒకటే మిష్టర్ యోగేంద్ర! నా మూలంగా కిరీటి దాంపత్యంలో కలతలు రేగ కూడదు.... అమాయకురాలైన శిల్ప జీవితం అడవికాసిన వెన్నెల కాకూడదు... వీలైనంత త్వరగా వాళ్ళు దగ్గర కావాలి.... వాళ్ళిద్దరూ మనసారా నవ్వగలిగే మధుర క్షణాలను చూడగలగాలి.... అదే నా ఆలోచన..."

ఆ తర్వాత వారిద్దరి మధ్య కిరీటి శిల్పల దాంపత్యానికి సంబంధించిన విషయాలు చర్చకు వచ్చాయి.

ఒకరు కిరీటికి మారొకరు శిల్పకు దగ్గరి వ్యక్తులు కావటంతో అప్రశ్రుతులు పలుకుతున్న వారి దాంపత్య జీవితం గురించి కూలంకషంగా చర్చించుకున్నారు.

చివరగా యోగేంద్ర అన్నాడు.

"ఈ స్పర్ధలు ఎల్లకాలం ఇలాగే కొనసాగుతాయి అన్న భయం నాకు లేదు మేడమ్! కాకపోతే నా ఆలోచన ఒక్కటే. శిల్ప స్వతహాగా మెత్తనిదైనా ఆమె పెరిగిన వాతావరణం తద్వారా పెంచుకున్న అహంకారం ఆమె ఎప్పటికీ తలవంచనివ్వదు. కాబట్టే కిరీటి తనంతట తానుగా తనకు దగ్గర కావాలని కోరుకుంటుంది. ఆమెలోని అహంకారానికి దారుణంగా గాయపడిన కిరీటి ఆమెలో ఓ అనుకూలమైన మార్పును ఆకాంక్షిస్తూ అలాంటి శుభక్షణం కోసం నిరీక్షిస్తూ రోజులు గడిపేస్తున్నాడు.

వాతావరణం. ఇద్దరిలో ముఖ్యంగా ఓర్పు కావలసింది శిల్పకు. అలా ఓర్పు చూపగలిగితే ఆమెను తన దోవలోకి మళ్ళించటం కిరీటికి అసాధ్యమైన విషయం కాదు!"

"కాని అనుక్షణం కిరీటిని అనుమానిస్తూ గడిపే శిల్పలో అటువంటి ఓర్పుని ఆశించటం సవ్యమేనంటారా?" యోగేంద్రను తదేకంగా చూస్తూ అడిగింది.

"మేడమ్! శిల్ప గురించి నాకు పూర్తిగా తెలుసు. బాల్యంలోనే తల్లిని పోగొట్టుకున్న శిల్ప తండ్రి నీడలో డబ్బు తప్ప ఆప్యాయత తెలియకుండా పెరిగింది. అన్నీ వున్నా ఏమీ లేవన్న వింత మనస్తత్వం ఆమెలో బలంగా స్థానం ఏర్పరచుకోవటంతో ఒక్కోమారు మొండిగానూ, మరోమారు మూర్ఖంగానూ ఇంకోసారి పసిపిల్లగానూ ఆలోచించటం ఆమెకు అలవాటైపోయింది. కాబట్టే కోరి వలచిన కిరీటి ప్రేమను స్వీకరించే శక్తిలేక అతడ్ని పూర్తిగా ద్వేషించలేక నలిగిపోతుంది. తన అహంకారంతో రాజీ పడలేక ఆత్మన్యూనతా భావానికి సమాధానం చెప్పుకోలేక సంఘర్షణ పడుతుంది. ఆదిలో తన ప్రవర్తనకి కించబడిన కిరీటి తనకు కాకుండా పోతాడేమోనన్న అభద్రతా భావానికిలోనై మధ్య మిమ్మల్ని అవమానిస్తూ అందులో మనశ్శాంతిని వెదుక్కునే విఫల ప్రయత్నం చేస్తూ కాలం నెట్టుకొస్తుంది. మీకు తెలీదు కిరీటిని ఆమె ఈనాడు ఎంతగానో ప్రేమిస్తుంది. ఆ ప్రేమను వ్య క్తంచేసే సావకాశం ఐమీన్ అనుకూలమైన పరిస్థితుల కోసం పిచ్చిగా నిరీక్షిస్తుంది. కాకపోతే ఇట్స్ క్వశ్చనాఫ్‌టైమ్. వారి మధ్య ఓ బలమైన సంఘటన ఊహించని సన్నివేశం ఏర్పడిన నాడు మనం వూహించిన రీతిలో ఇద్దరూ చేరువౌతారు. కాని అది ఎంతదూరంలో వున్నదీ మనం ఆలోచనకు అందని విషయం " నిట్టూర్చాడు
యోగేంద్ర .

చలోక్తులతో నవ్వులను మాత్రమే రువ్వుతాడనుకున్న యోగేంద్ర ఇంతలోతుగా ఆలోచించగలడని, అంతలా విషయ విశ్లేషణ చేయగలడని కన్యకు తెలియదు. అందుకే అశ్చర్యంగా అతడ్ని చూస్తూ ఉండిపోయింది.

కిరీటి దాంపత్య జీవితంలోనూ సుఖశాంతులు వెల్లివిరుస్తాయని ఆవిడిచ్చిన హామీతో ఆ రాత్రి కన్య హాయిగా నిద్ర పోయింది.

మరో రెండు రోజులు గడిచాయి.

నానీని స్కూల్‌కు పంపి ఏమీ తోచకపోవటంతో కన్య కన్‌స్ట్రక్షన్ జరుగుతున్న సైట్‌కు వెళ్ళింది.

కాంక్రీట్ మెషీన్ రోదతోనూ కూలీల సందడితోనూ, మేస్త్రీల అరుపులతోనూ అంతా హడావిడిగా వుంది.

గోడల వరకూ లేచిన నిర్మాణాన్ని పర్యవేక్షిస్తూ బిజీగా తిరుగుతున్న యోగేంద్ర కన్యను చూడగానే సాదరంగా ఆహ్వానించాడు.

ముఖాన స్వేదబిందువులతో, తలపై  హెల్మెట్‌తో గంభీరంగా బాధ్యాయుతమైన ఇంజనీరులా కనపడ్డాడు.

సిమెంట్ స్టాక్ చేయటానికైనా కట్టిన చిన్న షెడ్డులో ఆమెను కూర్చోపెట్టి ఫ్లాస్కులోని కాఫీ ఒంపి ఆమె చేతికి ఇచ్చాడు.

ఏదో అడగడానికి వచ్చిన మేస్త్రీకి కావలసిన ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి జరుగుతున్న పనిని స్వయంగా చూపాలని ఆమెను బయటకు తీసుకువచ్చాడు.

బారులుగా పేర్చబడిన ఇటుకల ప్రక్కగా నిలబడి యోగేంద్ర ఏయే గదులు ఎక్కడ వచ్చేది వివరంగా చేబుతుంటే ఏకాగ్రతతో వింటోంది కన్య.

ఇంతలో ధన్‌మన్న చప్పుడు..

ఉలిక్కిపడి వెనక్కి తిరిగిన యోగేంద్ర రివర్స్ చేసుకొంటూ వచ్చిన ఇటుకల లారీ గుద్దడంతో ప్రక్కకు ఒరుగుతున్న ఇటుకల వరుసల్ని గమనించి అమాంతం కన్యను మీదకు లాక్కుని వెనక్కి పడిపోయాడు.

మరికొన్ని క్షణాలు ఆలస్యమైతే ఇటుకల గుట్ట క్రింద కన్య సజీవంగా సమాధి అయిపోయేది.

వాతావరణం స్తంభించినట్టుగా కేకలు, అరుపులు ఆగిపోయాయి.

త్రుటిలో ప్రమాదం తప్పిపోయినందుకు అందరూ తేలిగ్గా గాలి పీల్చుకున్నారు.

భయంతో యోగేంద్రను కావలించుకున్న కన్యకు తనెక్కడున్నదీ గుర్తుకు రాగానే స్పృహ వచ్చినట్టయింది.

వివర్ణమైన ముఖంతో యోగేంద్ర గుండెలపైనుండి లేచింది.

ఆమె శరీరం వణుకుతోనూ -- విచిత్రమైన భావంతోనూ ప్రకంపించి పోతోంది.

యోగేంద్రను చూడాలంటే ధైర్యం చాలటం లేదు. అందుకే కనీసం థేంక్స్ కూడా చెప్పకుండా కారులో కూర్చుని వెళ్ళిపోయింది.

యోగేంద్ర పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే వుంది. అందుకే కొంతసేపటి వరకు స్తబ్ధంగా నిలబడి పోయిన యోగేంద్ర మళ్ళీ కర్తవ్యం గుర్తుకొచ్చిన వాడిలా అందర్నీ పనుల్లో పురమాయించాడు.

ఆ తర్వాత మూడురోజుల పాటు సాయంకాలం వేళల్లో కన్య దగ్గరకు వెళ్ళే యోగేంద్ర అలాంటి సాహసం చేయలేక పోయాడు.

మనసును ముప్పిరిగొంటున్న ఆలోచనల్ని పారద్రోలటానికై మరింత శ్రద్ధతో పనిపై ఏకాగ్రత చూపించటం మొదలుపెట్టాడు.



మూడురోజులుగా మానసిక సంఘర్షణతో నలిగిపోతుంది కన్య.

కనులు మూసినా తెరచినా ఆమె మస్తిష్కంలో అదే దృశ్యం.....

నిస్సారమైన జీవితంతో ఎంతగానో అలసిపోయి తను యోగేంద్ర గుండెలపై వాలిపోయినట్టు.... కాకతాళీయంగా జరిగినా కావాలని పరిష్వంగంలో ఒరిగిపోయినట్టు...

ఆమెలో నిలకడ నశించిపోయింది.

ప్రమాదం నుండి రక్షించబడినందుకు ఆనందం కంటే .... నిశ్చలంగా వున్న మానస సరోవరంలో సంచలనం బయలుదేరినందుకు ఎక్కువగా అలజడి చెందింది.

ఏమిటి ... తను మరో ఆసరాను కోరుకుంటోందా...?

ఒంటరి జీవితంతో తను వేగిపోతోందా...?

యోగేంద్ర గుర్తుకు రాగానే శరీరంలో ఎందుకీ ప్రకంపనం ...? ఏమిటీ మైకం .....?

అదుపులేని ఆలోచనలతో తనెందుకు ఓడిపోతోంది. కొన్నాళ్ళు యోగేంద్రకు కనపడ కూడదనిపించింది ఆసంఘటన జరిగిన తొలిరోజు.

అలవాటుగా సాయంకాలం అతడు వస్తే ఏదో కారణం చెప్పి మొహం చాటేయాలనుకుంది.

మూడురోజులు మూడు యుగాల్లా గడిచాయి.

ప్రతిక్షణం యోగేంద్ర తలపే.

ప్రతి నిమిషం అతడ్ని చూడాలన్న కోరికే.

నాలుగవరోజు ఆమె నిగ్రహం పూర్తిగా సడలిపోయింది.

ఏదో నెపంతో సైట్ కు వెళ్ళాలనుకుంది.

కాని ఆ దృశ్యాన్ని చూచిన అందరి ముందుకూ వెళ్ళాలంటే జంకు...ఎలా... ?

సాయంకాలం వరకు ఎదురు చూసింది యోగేంద్ర వస్తాడేమోనని.

ఫలితం లేకపోవటంతో సిగ్గువదలి అతడ్ని ఇంటి దగ్గరే కలియాలని నిర్ణయించుకుంది.

నానీని ఆయాకు అప్పజెప్పింది.

డ్రైవరును కూడా అవసరం లేదని చెప్పి తనే కారు డ్రైవ్ చేసుకుంటూ ఒకనాడు అతడు మాటల్లో చెప్పిన ఆనవాళ్ళ ప్రకారం అతడింటికి వెళ్ళింది.

బెడ్‌లైట్ కాంతిలో నిశ్చలంగా కూర్చుని 'షివాస్రీగల్' ను సేవిస్తున్న యోగేంద్ర కన్యను చూడగానే ఉలిక్కిపడ్డాడు.

కన్య హఠాత్తుగా అలా ప్రత్యక్షం కావటం ఒక విచిత్రమైతే అంత రాత్రివేళ ఇల్లు వెతుక్కుని పని గట్టుకు రావటం మరో విచిత్రం.

అందుకే తాగిన మైకంలో తనేమన్నా పొరపాటు పడుతున్నానా అనుకుంటూ చేష్టలుడికినట్టుగా నిలుచుండి పోయాడు కొన్ని క్షణాలపాటు.

తను కంటున్నది కలకాదని తెలుసుకున్న మరుక్షణం గదిలో లైట్ ఆన్‌చేసి ఆమెను సాదరంగా ఆహ్వానించాడు.

అతనికెదురుగా ఆమె కూర్చోగానే అనువుగాని వేళ వచ్చిందని కాస్త డెలికసీ ఫీలయ్యాడు.

అయినా ఆమె అలా రావటం ఓ వూహించని వరంగానూ, తను చేసుకున్న అదృష్టంగానూ భావించి సిగ్గుపడుతూ కాటిల్స్‌ని అక్కడినుంచి తీసేయబోతుంటే వారించింది కన్య.

"ఏదో అప్పుడప్పుడూ ఇలా పుచ్చుకుంటాను." సంజాయిషీ ఇస్తున్నట్టుగా అన్న యోగేంద్రను సూటిగా చూడలేక పోయిందామె.

ఆమె మనసులో ఆనాటి సంఘటన మెలగటంతో మాటలు కరువైనట్టుగా మిగిలిపోయింది.

గదిలోని నిశ్శబ్దాన్ని చీల్చుతూ టేప్‌రికార్డర్‌లో మెహదీహాసన్ సంగీతం వినిపిస్తుంది.

హృదయ తంత్రుల్ని మీటే రసరమ్య సంగీత ఝురిలో తడిసిపోతూ ఎంతోసేపు అలాగే వుండిపోయిన కన్య తనెందుకు వచ్చినట్టు అని ప్రశ్నించుకుని సమాధానం దొరక్కపోయే సరికి సిగ్గుతో కుంచించుకుపోయింది.

కనీసం యోగేంద్రయినా మాట్లాడొచ్చుగా ?

అతని పరిస్థితీ అలాగే వుందా?

"ఇంత రాత్రివేళ మీరిలా మా ఇంటిని పావనం చేస్తారని వూహించలేకపోయాను."

యోగేంద్ర మాటలతో ఆమె ఆలోచనలు తెగిపోయాయి.

"ఊహించివుంటే ఏం చేసేవారు? ఇలాంటి ఏర్పాట్లన్నీ నాకు కనిపించకుండా జాగ్రత్త పడేవారా?" బలవంతంగా తలపైకెత్తింది.

"నిజమే, నేను అతిగా గౌరవించే వ్యక్తుల ముందు దోషిలా నిలబడటం నాకిష్టం వుండదు."

అతని మాటలు కన్యకెంతో ఇంపుగా వినిపించాయి.

"అంటే నన్ను మీరు చాలా గౌరవిస్తున్నారని నమ్మమంటారు."

ఆమెకు తెలియకుండానే నేత్రాలు అరమోడ్పుకన్నులయ్యాయి.

"మీరు ఎక్కువగా నమ్మే విషయాలలో ఇదీ ఒకటి అన్నది నా నమ్మకం" అతడి మాటల్లోని చమత్కారానికి మైమరచిపోయింది.

"అలా అయితే యీ నాలుగు రోజులుగా మొహమెందుకు చాటేస్తున్నారు" అంది మనసులోని ఉద్వేగాన్ని కనపడనీయకుండా .

"అది అడుగుతూ ఇప్పుడు మీరెందుకు తల వాల్చుకున్నారు."

అతడి సూటి ప్రశ్నకు కన్య బిత్తరపోయింది. తన మనోభావాన్ని అతడు చదివేయగలడన్న ఆలోచన రాగానే ఎంత ప్రయత్నించినా జవాబు చెప్పలేకపోయింది.

"మేడమ్!"

యోగేంద్ర అలా సంబోధించటం ఆమెకెందుకో నచ్చలేదు.